క్లుప్తంగా

నేడు మహానేత వైఎస్సార్ జయంతి

కంచికచర్ల : మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందిగామ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు హాజరుకానున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేట అర్బన్: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జగ్గయ్యపేట పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్ సోమవారం తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వర రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఉదయం 9 గంటలకు పట్టణంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. అనంతరం విలియంపేట, పెద్దసెంటర్‌లోని కన్యాకుమారి షాపు వద్ద, క్రిస్టియన్‌పేట, కోదాడ రోడ్డులోని బేతెస్థ చర్చి వద్ద, ఆర్‌టీసీ బస్టాండ్ ఎదురుగా, బైపాస్ రోడ్డులోని వైఎస్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు వివరించారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పఠాన్‌ఖాన్ కోరారు.

లైబ్రేరియన్ రామచంద్రుడికి సత్కారం



కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయాధికారిగా పనిచేస్తూ బదిలీపై నందిగామ వెళ్తున్న అల్లూరి రామచంద్రుడును గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ కంచికచర్ల గ్రంథాలయ అభివృద్ధికి రామచంద్రుడు చేసిన సేవలను కొనియాడారు. ఆయన బదిలీ కావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీడీసీలు లక్ష్మి నరసయ్య, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, శ్రీనివాసరావు, నాగరాణి పాల్గొన్నారు. అదేవిధంగా రామచంద్రుడు స్థానంలో నూతన లైబ్రేరియన్‌గా సత్యనారాయణపురం శాఖా గ్రంథాలయం నుంచి బదిలీపై వచ్చిన వి.అమరేశ్వరి బాధ్యతలు చేపట్టారు. ఆమెకు సిబ్బంది, పాఠకులు అభినందనలు తెలియజేశారు.

మలిశెట్టి నాగేశ్వరరావుకు డాక్టరేట్



కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న మలిశెట్టి నాగేశ్వరావుకు డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ సోమవారం తెలిపారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి సంబంధించి 'ఎనర్జీ అవేర్ రౌంటింగ్ ఇన్ వైర్‌లెస్ సెన్సార్ నెట్‌వర్క్ త్రూ మెటా హెరిస్టిక్ ఆప్టిమైజేషన్ అల్గోరిథమ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు జేఎన్‌టీయూ (కాకినాడ) యూనివర్సిటీ అధికారులు, మలిశెట్టి నాగేశ్వరరావుకు డాక్టరేట్ అందించినట్లు వివరించారు. డాక్టరేట్ పొందిన నాగేశ్వరరావుకు కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో మొహరం

నందిగామటౌన్: పట్టణంలోని ముస్లింల సోమవారం మొహరం పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. భారత్ టాకీస్ రోడ్డులోని పీర్ల చావిడిలో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈసందర్భంగా ముజావర్ షేక్ సమీర్ మాట్లాడుతూ మొహరం పండుగ మహనీయుల త్యాగానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇస్లాం ధర్మస్థాపన కోసం హజరత్ ఇమాంహుసేన్ వీరోచిత పోరాటం చేశారని గుర్తుచేశారు. అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఏటా మొహరం పండుగను జరుపుకుంటున్నట్లు వివరించారు. అనంతరం మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలీ, పండు, యాసిన్ గౌసీ, హలీం, పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని జంధ్యాల దక్షిణామూర్తి ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనంత సేవా సంస్థ చైర్మన్ పెనుమత్స అప్పలరాజు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం ఎంతో గొప్పదని అన్నారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ఎల్లప్పుడు ముందుండాలని పిలుపునిచ్చారు. భోజనం ప్లేట్లు, ఇతర పరికరాలను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. స్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి, లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వత్సవాయి కృష్ణంరాజు, ట్రెజరర్ ఏహెచ్‌వీ సురేష్, వైస్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, వాంబేకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కె.రామరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా మాగాణి సాగు?

- సకాలంలో కురవని వర్షాలు..
- సాగర్ జలాల కోసం రైతుల ఎదురుచూపులు



నీరు లేకుండా దర్శనమిస్తున్న సాగర్ కాల్వ

జగ్గయ్యపేట: కూటమి ప్రభుత్వంలో రైతు పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోంది. ఆరుగాలం రైతు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అన్నదాతలు అల్లాడుతున్నారు. రైతుభరోసా సాయం లేదు. పంటల బీమాకు లేదు. ఇక వరి ధాన్యం రైతు పరిస్థితి వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన ఏడాది కాలంలో సకాలంలో వర్షాలు కూడా పడకపోతుండటంతో పరిస్థితి దయనీయంగా మారింది. ఇక అంతంతమాత్రంగానే ఉన్న సాగర్ జలాల సరఫరాకు తోడు ప్రతికూల పరిస్థితుల్లో ధాన్యం సాగుచేస్తే ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందనుకుంటే ఆ ఆశలు కూడా అడియాసలే అవుతున్నాయి. ఇన్ని కష్టాల మధ్యన రైతులు సాగర్‌జలాల కోసం ఎదురు చూస్తూ సాగుకు సమాయత్తమవుతున్నారు.

సాగునీరు అందేనా..

ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలతోపాటు విజయవాడ రూరల్ మండలాలలో సుమారు 1.26లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టేందుకు రైతులు సమాయత్తమవుతున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని పలు గ్రామాలలో బోర్లు, చెరువుల కింద వరి సాగు పనులు అక్కడక్కడ చేపడుతున్నారు. మాగాణి సాగు పనుల్లో భాగంగా జూలై నెలలో వరినారు మడులు సిద్ధం చేయాల్సి ఉండగా, సాగర్ జలాలు విడుదల కాకపోవడంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. సాగు నీరు వస్తుందనే ఆశతో రైతులు ఇప్పటికే వరి విత్తనాలు కొనుగోలు చేయగా, నీటిజాడ మాత్రం కానరాకపోతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

ఏటా ఎదురుచూపులే..

ఏటా సాగునీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం వరిసాగుకు సాగర్ జలాలు విడుదలైతేనే సాగు ముందుకు సాగుతుందని రైతులు చెబుతున్నారు. డీవీఆర్ బ్రాంచి కెనాల్ కింద జగ్గయ్యపేట నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో వరిసాగు చేపట్టాల్సి ఉంది. తిరువూరులో రాకెట్ సప్లయ్ చానల్, కట్టలేరు, మైలవరంలో ఎన్ఎస్పీ కాల్వ, తారకరామా ఎత్తిపోతల పథకాల కింద వరిసాగు చేపట్టే రైతులు సాగునీటి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సాగర్ జలాలు విడుదల కాకపోవడంతో తీవ్ర నిరాశ చెందుతున్నారు.

ఆగస్ట్ 15 తర్వాతే నీటి విడుదల..

ఖరీఫ్ సాగుకు సాగర్ జలాలు విడుదల చేస్తాం. వరిసాగు రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాగర్‌జలాలను ఆగస్టు 15వ తేదీ తర్వాత విడుదల చేసే అవకాశం ఉంది.

– కిషోర్, ఎన్నెస్పీ ఈఈ

సాగర్ జలాల వస్తేనే సాగు..



వరి పంట సాగు చేసుకునేందుకు సాగర్ జలాల కోసం ఎదురు చూస్తున్నాం. నీటిని ఎప్పుడు విడుదల చేస్తారో తెలియకపోవడంతో నారుమడులు కూడా సిద్ధం చేయలేదు. ఏటా సాగర్ జలాల కోసం ఎదురుచూడక తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి సాగర్ జలాలను వెంటనే విడుదల చేయాలి.

గూడపాటి శేషయ్య, గుండబోయినపాలెం

నీటిజాడ తెలిస్తే సాగుకు సిద్ధం ...



సాగర్‌జలాలు ఎప్పుడు విడుదలవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నీటి విడుదల జాడ తెలిస్తే నారుమడులు సిద్ధం చేసుకుని సాగు చేపడతాం. సాగర్ జలాలు అందకపోతే తీవ్రంగా నష్టపోతాం. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాగర్ జలాలు విడుదల చేయాలి.

తోట హనుమంతరావు, రైతు, బండిపాలెం

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ



రైతులకు విత్తనాలను అందజేస్తున్న కోఆర్డినేటర్ అచ్యుతరాజు

గరికపాడు(జగ్గయ్యపేట):ఖరీఫ్ సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆయా పంటలసాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్ అచ్యుతరాజు సూచించారు. కేవీకేలో సోమవారం ఖరీఫ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ఎంపిక నుంచి పంట దిగుబడి వచ్చే వరకు రైతులు పంటలసాగులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వరిలో కలుపు, తదితర విధానాలపై అవగాహన కల్పించారు. యాజమాన్య పద్ధతులు పాటించాలని సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఉద్యాన పంటల్లో ఆ శాఖాధికారుల సలహాల మేరకు సాగు చేపట్టాలని తెలిపారు. అనంతరం పునాది విత్తనాలను రాయితీపై అందించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లక్ష్మీకళ, ప్రభావతి, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె తెచ్చిన అనిగండ్లపాడు గ్రామ మహిళలు



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

పెనుగంచిప్రోలు:ఆషాఢమాసం సందర్భంగా గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారికి సోమవారం అమ్మవారి స్వగ్రామం అనిగండ్లపాడు గ్రామం నుంచి మహిళలు సారె సమర్పించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సారె తెచ్చిన మహిళలకు ఆలయం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు. వేద పండితులు వారిని ఆశీర్వదించారు. ఆలాగే వత్సవాయి మండలం పోలంపల్లి నుంచి కూడా మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి సారె తెచ్చి బోనాలు సమర్పించారు. సారె తెచ్చిన వారికి ఆలయం వారు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పాలాది వెంకటరమణ, మాజీ ధర్మకర్త కోలా రామారావు, గ్రామ పెద్దలు వూట్ల లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 16 అర్జీలు

నందిగామటౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 16 అర్జీలు అందినట్లు ఆర్డీవో కె.బాలకృష్ణ తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఐదు అర్జీలు, సర్వే నాలుగు, పోలీస్‌శాఖ మూడు, విద్యుత్ శాఖ ఒక టి, పౌర సరఫరాల శాఖ ఒకటి, పంచాయతీ రాజ్ ఒకటి, విద్యాశాఖకు సంబంధించి ఒక అర్జీ అందినట్లు వివరించారు. అర్జీలను ఆయా శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తగిన చర్య లు తీసుకుంటానని తెలిపారు. పీజీఆర్ఎస్ లో ఆయాశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకం



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు, పక్కన ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్, బెనర్జీ

పెనుగంచిప్రోలు: మండలంలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల నిర్వాహకులు ఆయా ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో హిందూ, క్రైస్తవ, ముస్లిం మత పెద్దలతో పోలీసులు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ భక్తుల రద్దీ ఉండే చోట సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతను పటిష్టపరచుకోవచ్చన్నారు. నేరాల నియంత్రణలోనూ సీసీ కెమెరాలు కీలకంగా మారాయని వివరించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్, శ్రీఅయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన



పనిముట్లతో నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నందిగామరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ఆందోళన సోమవారం మూడోరోజుకు చేరింది. ఆందోళనలో భాగంగా ఇంజినీరింగ్ కార్మికులు విధి నిర్వహణలో వినియోగించే పనిముట్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించడంతోపాటు ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, కండెల శ్రీను, దారెల్లి అశోక్, బ్రహ్మం, వంశీ, దాసు, రవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామోత్సవం నిలిపివేతపై భక్తుల మండిపాటు

పెనుగంచిప్రోలు: ఏటా ఆషాడమాసం శ్రీతిరుపతమ్మవారితోపాటు ఆలయంలోని సహదేవతలను శాకాంబరీ అలంకరణ అనంతరం ఆదేరోజు సాయంత్రం గ్రామంలో ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. అయితే ఈఏడాది వర్షం కురుస్తుందేమోనన్న సందేహంతో అధికారులు ఆదివారం రాత్రి జరగాల్సిన గ్రామోత్సవాన్ని నిలిపివేశారు. మధ్యాహ్నం మబ్బు పట్టడంతో వాతావరణం అనుకూలించదని భావించిన అధికారులు గ్రామోత్సవం నిలిపివేయడమేమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. తొలి ఏకాదశి పర్వదినాన అమ్మవారి ఊరేగింపుగా తమ ఇంటి ముందుకు అమ్మవారు వస్తుందని గ్రామస్తులు భావించగా, వాతావరణం అనుకూలించదనే ఉద్దేశ్యంతో గ్రామోత్సవం ఎలా నిలిపివేస్తారని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వర్షం పడుతుందనుకుంటే వాతావరణశాఖ అధికారుల నుంచి వాతావరణ సమాచారం తీసుకోవాలని, అలా చేయకుండా ఆలయ అధికారులు ఇష్టారాజ్యంగా ఎలా నిర్ణయం తీసుకుంటారని గ్రామమహిళలు మండిపడుతున్నారు. గతంలోనూ ఆలయ అధికారులు ఇలానే చేసి, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని గుర్తుచేసుకుంటున్నారు. ఇకనైనా ఆలయ అధికారులు భక్తుల మనోభావాలను గుర్తించడంతోపాటు ఆలయ ఆచార, సంప్రదాయాలను గౌరవించాలని భక్తులు కోరుతున్నారు.

ఎమ్మార్పీఎస్ స్తూపం ఆవిష్కరణ



జమ్మవరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వీరులపాడు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మవరంలో నూతనంగా నిర్మించిన ఎమ్మార్పీఎస్ స్తూపాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మందా పిచ్చయ్య మాదిగ మాట్లాడుతూ మందా కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకు నిరంతరం కృషిచేశారన్నారు. తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడారన్నారు. అదే విధంగా మండలంలోని వీరులపాడు, కొణతాలపల్లి, వెల్లంకి, జుజ్జూరు, అల్లూరు తదితర గ్రామాలలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులోభాగంగా సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇన్‌చార్జ్ ఈవో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఈనెల 10న ఆషాడ మాసపౌర్ణమి సందర్భంగా సత్యమ్మ అమ్మవారిని పలురకాల కూరగాయలతో శాకంబరీ దేవిగా అలంకరిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి శాకంబరీ అలంకారానికి కూరగాయలు, తదితరాలను అందించదలచిన భక్తులు ఈనెల తొమ్మిదోతేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా అందించాలని ఆయన కోరారు.

బాబు ష్యూరిటీ అంటే మోసం గ్యారెంటీ



క్యూఆర్ కోడ్ స్కానర్ ఆవిష్కరిస్తున్న మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ జగన్‌మోహనరావు, తన్నీరు నాగేశ్వరరావు తదితరులు



హాజరైన పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి

జగ్గయ్యపేటఅర్బన్: ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ పాలనలో కంటే ఎక్కువ పథకాలు ఇస్తామంటూ సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు మాయమాటలు చెప్పిన సీఎం చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలోతొక్కారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి విమర్శించారు. పథకాలను అమలుచేయకుండానే సూపర్ సిక్స్ ఇచ్చేశామంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం చంద్రబాబు కుయుక్తులను వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. జగ్గయ్యపేటలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి...

'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' పేరుతో రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు, ఇంటింటికి ఎంత లబ్ధి చేకూరుతుందోనంటూ టీడీపీ పంపిణీ చేసిన బాండ్ల గురించి వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎన్నికల మేనిఫెస్టో పేరుతో సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. ఈసందర్భంగా మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పథకాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ఉంటే..ఓట్లు వేసిన వారు ఎందుకు ఊరుకోవాలి? అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయకపోతే ప్రశ్నించే హక్కు ప్రజలు, ప్రతిపక్షానికి ఉంటుందన్నారు. హామీలను అమలుచేయాలని కోరితే తాట తీస్తాం, తోలు వలుస్తామంటూ సీఎం చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలకు ఎవ్వరూ భయపడరన్నారు. హామీలు అమలుచేసే వరకు వదిలిపెట్టబోమని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఆయన నిజస్వరూపాన్ని తేటతెల్లం చేయాలన్నారు. తద్వారా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే వరకు విశ్రమించకూడదన్నారు.

మోసం చంద్రబాబు నైజం...

నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు ఎగ్గొట్టి ప్రజలకు ఎంతమేర బకాయి పడిందనే అంశంపై ప్రజలను చైతన్యవంతులను చేయాల్సి అవసరం ఉందన్నారు. 2014 లో కూడా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, కానీ 2024లో పవన్‌కల్యాణ్ ఉన్నారు... బీజేపీ ఉంది కాబట్టి అమలుచేస్తాడని ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే ఈసారి కూడా ప్రజలను నిండాముంచారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్భిక్షమైన పాలన, కక్ష పూరితమైన పాలన కొనసాగుతున్నారు. నోరు తెరిస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎంపీ కేశినేని చిన్ని నేతృత్వంలో ఇసుక అక్రమరవాణా యథేచ్ఛగా సాగుతోందని మండిపడ్డారు. పోలంపల్లి ప్రాజెక్టు, వేదాద్రి ఎత్తిపోతల పథకాలను పట్టించుకోకపోవడంతో వేలాది ఎకరాల సాగు భూమి పరిస్థితి పశ్నార్థకంగా మారిందన్నారు. పేట టీడీపీలో అధిపత్య పోరుతో ప్రజాసమస్యలను విస్మరిస్తున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. తొలుత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు వేల్పుల రవికుమార్, శ్రీనివాసరెడ్డి(గుంటూరు), రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, రాష్ట్ర చేనేత విభాగం అధికారప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి కన్నమాల శామ్యూల్, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర ప్రచారంవిభాగం కార్యదర్శి చౌడవరపు జగదీష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపతి విజిత, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు ఏలూరు శివాజీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, ఏటిపట్టు మండలాల అధ్యక్షులు, బూడిద నరసింహారావు, పొన్నం కోటేశ్వరరావు, గుత్తా శంకరరావు, రేఖా శ్రీనివాసరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జడ్పీటీసీలు ఊట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, న్యాయవాది సత్యశ్రీనివాసరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగ్‌నగర్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదంలో కాలిపోయిన సామాన్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఓ శవయాత్రలో కాల్చిన బాణాసంచా వచ్చి పడటంతో సింగ్‌నగర్‌లో ఒక తాటాకు ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్ చింతావారి వీధిలో పోతనబోయిన సూర్యకుమారి, దుర్గారావు దంపతులు ఓ పూరింటిలో నివసిస్తున్నారు. వీరితోపాటు దుర్గారావు తల్లి నాంచారమ్మ, కూతురు మహేశ్వరీ కూడా ఉంటున్నారు. అయితే సింగ్‌నగర్ ప్రాంతంలో ఓ వ్యక్తి చనిపోవడంతో ఆ శవయాత్ర డాబాకొట్లు సెంటర్ మీదుగా వెళ్లింది. ఈ యాత్రలో కాల్చిన బాణాసంచాలోని ఓ తారాజువ్వ సూర్యకుమారి ఇంటిపై పడి నిప్పంటుకుంది. క్షణాల్లోనే దాని నుంచి మంటలు వ్యాపించడంతో ఇంటిలో ఉన్న దుర్గారావు, నాంచారమ్మలు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసేలోపు ఇల్లు, ఇంటిలోని సామాన్లన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంటిలో వారు దాచుకున్న డాక్యుమెంట్లు, కుమార్తె వివాహం కోసం కూడబెట్టుకున్న నగదు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.6 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. తప్పిన పెను ప్రమాదం అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఆ ఇంటిలో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లను గుర్తించి బయటకు తీసుకువచ్చిపడేశారు. లేకుంటే గ్యాస్ బండలు పేలి పెనుప్రమాదమే చోటుచేసుకునేది. అగ్నిప్రమాదంలో అన్నీ కాలిపోవడంతో కుటుంబం మొత్తం కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితులు ప్రాధేయపడుతున్నారు.